

ఈసీ మార్గదర్శకాలను అనుసరించండి

● కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ తదితరులు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సి వుందన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో ఈఆర్వో, ఏఈఆర్వో,నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో కిషోర్, ఈఆర్వోలు ధ్యానచంద్ర, ఆదితిసింగ్, నిశాంత్‌రెడ్డి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం రాత్రి ఒంటిగంటకు కలెక్టరుగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్‌ను శుక్రవారం పలువురు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.వీరిలో జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్,కమిషనర్ ఆదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, డీఎంహెచ్‌వో శ్రీహరి తదితరులున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్)

ఇది కోడ్ ఉల్లంఘన కాదా?



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడు వారాలవుతోంది. ప్రజాప్రతినిధులు ఎవరూ జనాన్ని ప్రలోభపెట్టే పనులు కానీ, ఆకర్షించే పనులు కానీ చేయకూడదని ఎన్నికల నియమావళి చెబుతోంది.అయితే అక్కడక్కడా కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే వున్నాయి. తాజాగా శ్రీకాళహస్తి పట్టణంలోని ముస్లింలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పెద్దమసీదు వద్ద ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం శుక్రవారం స్వీట్‌బాక్సులు పంచిపెట్టారు.ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, జనార్దన రావు జె.పవార్, వడ్ల తాంగళ్ బాలాజీ ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.మరి ఈ కార్యక్రమం కోడ్ ఉల్లంఘనో, కాదో అధికారులే తేల్చాల్సివుంది.

- శ్రీకాళహస్తి

టీడీఆర్ బాండ్ల నిలిపివేతపై
కలకలం

అప్పటికే 75శాతం బాండ్లు వినియోగం

● గత నెల 23నే పురపాలక శాఖ ఉత్తర్వులు

తిరుపతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల చెల్లుబాటు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కలకలం రేపింది. లావాదేవీలకు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవంటూ గత నెల 23న పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఉత్తర్వుల నాటికి బాండ్లను వినియోగించుకోని వారి గుండెల్లో గుబులు రేగింది. ఎక్కువ సంఖ్యలో రోడ్లను నిర్మించి తద్వారా టీడీఆర్ బాండ్లు జారీచేసి, పెద్దమొత్తంలో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతల ఆలోచనలకు తాజా ఉత్తర్వులతో బ్రేకు పడింది. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పెద్దమొత్తంలో టీడీఆర్ బాండ్ల దోపిడీ జరిగిందని విపక్షాలు ఆరోపించడంతో పాటు, మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చిన నేపథ్యంలో శ్రీలక్ష్మి రెండు నెలల క్రితమే విచారణకు ఆదేశించింది. అయితే ఈ విషయమై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి నివేదిక పంపకపోగా అధికార పార్టీకి చెందిన కీలక నేతలు ఆమెపై విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన ఆమె ఏకంగా టీడీఆర్ బాండ్ల చెల్లుబాటును నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. తిరుపతిలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లకు ముందుగా సరైన సర్వే చేయకపోవడంతో పాటు కొన్ని చోట్ల దౌర్జన్యకరమైన పద్ధతుల్లో భూములు తీసుకుని హడావుడిగా రోడ్ల నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన మొత్తం 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి టీడీఆర్ బాండ్లు జారీచేశారు. గొల్లవానిగుంట, కొర్లగుంట ప్రాంతాల్లో స్వల్పంగా భూములు కోల్పోయిన వారితో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొందరికి పెద్దమొత్తంలో బాండ్లు జారీ అయ్యాయి. ఇంకా 1200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది.చదరపు గజానికి రూ.35వేల చొప్పున 2.80 లక్షల చదరపు గజాల స్వాధీనంతో కూడిన 342 టీడీఆర్ బాండ్ల జారీపై వివరణాత్మక నివేదికను సమర్పించాలని తిరుపతి కమిషనర్‌ను పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. మొత్తం రూ1,013 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికే 75 శాతం టీడీఆర్ బాండ్ల వినియోగం జరిగిపోయిందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి.టీడీఆర్ బాండ్ల చెల్లుబాటును పూర్తిగా రద్దు చేయలేదని తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అవి చెల్లుబాటు కావని అంటున్నాయి. ఎక్కువ సంఖ్యలో రోడ్లను నిర్మించి తద్వారా టీడీఆర్ బాండ్లు జారీచేసి, పెద్దమొత్తంలో లబ్ధి పొందాలని భావించిన వైసీపీ నేతల పన్నాగానికి తాజా ఉత్తర్వులతో బ్రేకు పడిందనే భావించవచ్చు.

నడినెత్తిన నిప్పులు

● గూడూరు, శ్రీకాళహస్తిల్లో 42 డిగ్రీలు
● ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా తిరుపతి బస్టాండు రోడ్డు, ఫ్లై ఓవర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు.పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో ఉదయం 8గంటలకే బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ సరఫరా అంతరాయం కారణంగా జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం జిల్లాలో అత్యధికంగా శ్రీకాళహస్తి,గూడూరు ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా సూళ్ళూరుపేటలో 41డిగ్రీలు,తిరుపతిలో 39.6డిగ్రీలు నమోదయ్యాయి.ఎండ తీవ్రత ప్రభావం తిరుమల తదితర పుణ్యక్షేత్రాలపై కూడా పడింది.ఆలయాల్లో రద్దీ బాగా తగ్గిపోయింది.ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ఉదయం 6 నుంచి 11గంటల లోపు పని ముగించుకుని ఇళ్లకు చేరిపోతున్నారు. సాయంత్రం 4 గంటల తరువాతే ప్రచారం కోసం బయటకు అడుగుపెడుతున్నారు.



అలిపిరి వద్ద దాహం తీర్చుకుంటున్న వానరం



కూటమి విజయాన్ని ఆపలేరు

● వైసీపీ అరాచకాలు, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారు
● తిరుపతి పార్లమెంట్ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ సమావేశంలో నేతల ధ్వజం



తిరుపతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఎంపీ అభ్యర్థితో పాటు అన్ని స్థానాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని టీడీపీ,బీజేపీ,జనసేన నేతలు స్పష్టం చేశారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశం శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఎన్నికల సన్నద్ధత,బహిరంగ సభల నిర్వహణ, సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రచారం, ఎంపీ అభ్యర్థి మేనిఫెస్టోలతో పాటు స్థానిక సమస్యలపై చర్చించారు. అనంతరం మీడియతో నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయ పతాకాన్ని ఎగరవేయనున్నారని చెప్పారు. పొత్తుల్లో భాగంగా కేటాయింపులు జరిగిన స్థానాల్లో కూటమి పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా జీవితాలను నాశనం చేస్తున్న వైసీపీ విధానాలను గమనించి పవన్ కళ్యాణ్ బీజేపీ, టీడీపీతో కలసి జట్టు కట్టారని, వైసీపీని తరిమి కొట్టాలని కంకణం కట్టుకున్నారన్నారు.జగన్ రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలతో విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప మాట్లాడుతూ దేశానికి మోదీ నాయకత్వం అవసరమని, రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలంటే బీజేపీ గెలవాలన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అరాచకాలు చూసి ప్రపంచం నలుమూలల ఉన్న హిందూ సమాజం విస్తుపోతోందన్నారు. వైసీపీకి ఇవే చివరి రోజులన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మాట్లాడుతూ దళితులను జగన్ రెడ్డి దారుణంగా వంచించారని మండిపడ్డారు. తానొక ఐఏఎస్ అధికారి అన్న విలువ కూడా ఇవ్వకుండా అవమానించారని ఆవేదన చెందారు. తనకన్నా జగన్ రెడ్డి ఏమంత గొప్ప అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుని పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు, మోదీలకు కానుకలుగా ఇద్దామన్నారు.శ్రీకాళహస్తి , సత్యవేడు నియోజకవర్గాల అభ్యర్థులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, టీడీపీ నేతలు శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

93శాతం పెన్షన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీ శుక్రవారం కూడా కొనసాగింది.95శాతం సచివాలయాల వద్దనే పెన్షన్లను పంపిణీ చేశారు. వికలాంగులకు, దీర్ఘకాలిక రోగులకు, మంచానికే పరిమితమైన వారికి ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొంతమందికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పింఛనుదారులు మండుటెండలో అష్టకష్టాలు పడి సచివాలయాలకు రావాల్సి వచ్చింది.శనివారంతో పింఛన్ల పంపిణీ ముగిస్తామని జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో 2,71,477మంది పింఛనుదారులుండగా మూడు రోజుల్లో 2,53,804మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. ఇక 17,673మంది మాత్రమే పెన్షన్లు తీసుకోవాల్సి వుందని అధికారులు తెలిపారు.




రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం) : సా. 6.28
సహరి (ఆదివారం) : ఉ. 4.45



బ్రాండెడ్ బీర్లు దాచేస్తున్నారు

● మందుబాబులకు జే బ్రాండ్లను అంటగడుతున్నారు





బ్రాండెడ్ బీరు - జె. బ్రాండ్ బీరు

గోడౌన్లకు తరలించేస్తున్నారు

ఎన్నికల సీజన్ కావడంతో వైసీపీ నాయకులు బ్రాండెడ్ బీర్లను దాచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.తిరుపతి, శ్రీకాళహస్తి,చంద్రగిరి వంటి ప్రాంతాల్లో కొందరు వైసీపీ నాయకులు పోటీపడి బ్రాండెడ్‌తో పాటు జే బ్రాండు బీర్లను కూడా లాట్‌గా కొనుగోలు చేసి, గోడౌన్లకు తరలిస్తున్నట్లు సమాచారం. తిరుపతి శివారు ప్రాంతాల్లో ఇలాంటి గోడౌన్లు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5 : వేసవి వచ్చిందంటే బీర్లకు సహజంగానే డిమాండ్ పెరుగుతుంది. ఎండలకు తట్టుకోలేక మద్యం ప్రియులు బీర్లు ఎక్కువగా తాగుతుంటారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా ఉన్న 40 బార్లలో రోజుకు రూ.3 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అయితే తాజాగా ఖర్జూరా, నాక్ అవుట్, బడ్‌వైజర్, హేవార్డ్స్ 5000, కింగ్‌ఫిషర్, కార్ల్స్ బర్గ్ వంటి బ్రాండెడ్ బీర్లు ఎక్కడా కనిపించడం లేదు. తిరుపతిలోని 16 బార్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో బ్రాండెడ్ బీర్లు దొరకడమే గగనంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బ్రాండెడ్ బీర్ల స్థానంలో జే బ్రాండ్‌గా పేరుపడ్డ ఫోస్టర్, బీరా, బూమ్, బ్లాక్ బస్టర్, ఎస్ఎన్‌జె, కింగ్ ఫిషర్ స్టాండర్డ్, బ్రిటిష్ ఎంపైర్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, బడ్ వంటివి కనిపిస్తున్నాయి. వాటి ధరలు బ్రాండెడ్ బీర్లకు ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఉదాహరణకు కింగ్ ఫిషర్ బీరు రూ.400 అనుకుంటే అదే జే బ్రాండ్ బీరు ఫోస్టర్, బూమ్ రూ.380కి విక్రయిస్తున్నారు.సరఫరా లేదనే పేరుతో నాసిరకం మద్యాన్నే అంటగడుతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారిని వివరణ కోరగా బ్రాండెడ్ బీర్ల ఉత్పత్తి తగ్గిపోయిన కారణంగానే సరఫరా తగ్గించామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి




ఘటనా స్థలంలో రవీంద్రనాథ రెడ్డి మృతదేహం

పాకాల,ఏప్రిల్5: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని పాకాల మండలం తోటపల్లె సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. పాకాల శివశక్తినగర్‌లో ఉంటున్న బి.రవీంద్రనాథ రెడ్డి (55) పోలవరపుఇండ్లులోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసేవాడు. ఇటీవల పదోన్నతిపై శాంతిపురం మండలానికి వెళ్లాడు. శుక్రవారం సెలవు కావడంతో సొంతూరికి వచ్చాడు. వ్యక్తిగత పని నిమిత్తం తిరుపతికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా తోటపల్లె సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన భార్య దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



పాకాల, ఏప్రిల్ 5: మండల పరిధిలోని పెద్దరామాపురం, పెద్దగోర్పాడు, గానుగపెంట, మద్దినాయనిపల్లె, చిన్నగోర్పాడు గ్రామాల్లో బీఎ్‌స్ఎఫ్ దళాలతో కలిసి పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ రాజగోపాల్ కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పేరసానిపల్లెలో టీడీపీ ప్రచారం



పేరసానిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పాకాల, ఏప్రిల్ 5:పాకాల మండలం పేరసానిపల్లె పంచాయతీ పరిధిలో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కొత్తపల్లె, గుట్టమీద ఇండ్లు, తురకపల్లె, గుండ్లగుట్టపల్లె గ్రామాల్లో ప్రచారం చేశారు. తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నానీని గెలిపించాలని కోరారు. దామలచెరువులో శుక్రవారం సాయంత్రం ముస్లింల ఇఫ్తార్ విందులో పులివర్తి నాని పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



చంద్రగిరి, ఏప్రిల్ 5: చంద్రగిరిలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం మండల దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. దళిత నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఏఏపీ అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య, టీడీపీ నాయకులు పోట్లూరి రామారావు, శంకర్‌మాదిగ, మాజీ జడ్పీటీసీ అమ్ములు, శ్రీపతి, మంగాపురం బాలసుబ్రమణ్యం, ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటపతి మాదిగ, కాంగ్రెస్ నాయకులు రాజేంద్ర, వైసీపీ నాయకులు వరముని, రన్స్ సుబ్బరామయ్య, గిరిజన పరమాల గోపి, నకులయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్ల ఢీ : ఇద్దరికి గాయాలు



చంద్రగిరి, ఏప్రిల్ 5: చంద్రగిరి మండలంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ... తిరుపతి నుంచి పీలేరుకు వెళుతున్న బెలూనా కారు, పీలేరు నుంచి తిరుపతికి వస్తున్న ఇతియోస్ కారు ఎ.రంగంపేట సమీపంలోని కృష్ణాపురం వద్ద ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో బెలూనా కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తలకోన నీటి సాధన కోసం ప్రజా చైతన్య పర్యటన



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 5: తలకోన శేషాచల అటవీ ప్రాంతం నుంచి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరిచేందుకు సాధన కమిటీ సభ్యులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటనలు చేపట్టారు. తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షుడు మారేళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సభ్యులు చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ, మల్లెలవాండ్లపల్లె, దూదేవాండ్లపల్లె, గొల్లపల్లె, పాతపల్లె, కొత్తపల్లె, వెంకటాపురం, మైలావాండ్లపల్లె, మాదిగపల్లె, ఎర్రావారిపాలెం మండలంలోని మేదరపల్లె, చింతగుంట, నాగినేనివారిపల్లె, పసుపులేటివారి పల్లె, సిద్దుగారిపల్లె, చాదావారిపల్లెల్లో శుక్రవారం పర్యటించారు. తలకోన ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజలు రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులపై ఒత్తిడి తీసుకురావాలని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఈ పర్యటనలో కమిటీ గౌరవాధ్యక్షుడు కేకే రెడ్డి, సభ్యులు రెడ్డిప్రసాద్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నానీని ఆదరించండి



దిగువరామాపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 5: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని ఎన్నికల్లో ఆదరించి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యువనేత పులివర్తి వినీల్ కోరారు.రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామాపురం పంచాయతీ దిగువ రామాపురం, ఏడబ్ల్యు, హెచ్‌డబ్ల్యు కాలనీల్లో శుక్రవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం చేపట్టారు. టీడీపీ నేతలు తిరుమలరెడ్డి, జనార్దన చౌదరి, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, రవికుమార్, రామిరెడ్డి, ధనంజయరెడ్డి, గిరిధర్‌రెడ్డి, హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, బండి విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన మోక్ష

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5 : తిరుపతిలో వైద్య విద్య అభ్యసిస్తున్న కె.మోక్ష (22) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. యూనివర్సిటీ పోలీసుల వివరాల మేరకు.. పద్మావతి మహిళా వైద్య కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న మోక్ష కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. రాత్రి ఇంట్లో ఉలుకూపలుకూ లేకుండా పడి ఉండడంతో తల్లిదండ్రులు గమనించి 108 అంబులెన్సులో స్విమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పక్కన నిద్ర మాత్రల డబ్బా పడి ఉండడంతో అధిక మోతాదులో మింగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తండ్రి బాబ్జి ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీకి ఎదురు దెబ్బ

చంద్రబాబు, నానీలతో ఏవీ రమణమూర్తి, సురేష్‌రెడ్డి తదితరులు



● టీడీపీలో చేరిన ముఖ్య నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 5: చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది.ఐతేపల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏవీ రమణమూర్తి, చంద్రగిరి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైసీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంగా బాబురెడ్డి శుక్రవారం టీడీపీలో చేరారు.పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురంలో పులివర్తి నాని ఆధ్వర్యంలో వీరికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చంద్రగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొంటామని హామీ ఇచ్చారు.చంద్రగిరి టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి జడ్పీటీసీ దంపతులు

పాకాల, ఏప్రిల్ 5: పాకాల జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఆమె భర్త వైసీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి శుక్రవారం చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.వైసీపీ ఆవిర్భావం నుంచి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ముఖ్య అనుచరులుగా వున్న వీరు టీడీపీలో చేరడంపై మండలంలో చర్చనీయాంశమైంది.చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా, గోపాలపురం వెళ్లిన వారు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో ఉత్సవ విగ్రహాల్లా వుండలేక, అవమానాలను భరించలేక వైసీపీని వీడి టీడీపీలో చేరామన్నారు. పులివర్తి నానిని అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. వీరితో నంగా నితిన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, విక్కి, ప్రసన్న తదితరులు పార్టీలో చేరారు.

కాల్వ పోరంబోకు ఆక్రమణ

● చోద్యంచూస్తున్న అధికార యంత్రాంగం




కాల్వపోరంబోకుని చదును చేసిన దృశ్యం - ఈస్థలంలో గుడిసె వేసుకుంటామని వచ్చిన వైఎస్సార్ కాలనీ వాసులు

తిరుపతి రూరల్, ఏప్రిల్5: మండలంలో చిగురువాడ పంచాయతీ పరిధిలోని ఉత్తరపు కండ్రిగలో విలువైన కాల్వ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైంది. సర్వేనెంబరు 301/2లో 60సెంట్లతోపాటు 319, 346, 347, 348, 350లలో దాదాపు మూడెకరాల విస్తీర్ణంలో కాల్వ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి చుట్టూ అనుమతులున్న పలు లేఅవుట్లతోపాటు వ్యవసాయ పట్టా భూములున్నాయి. ఈ భూమికి విలువ పెరగడంతో దీనిపై కబ్జాదారుల కన్నుపడింది. గతంలో సర్వేనెంబరు 301/2లోని కాల్వ భూమిని కొందరు చదును చేసి ఆక్రమణలకు పాల్పడగా తహసీల్దార్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. తాజాగా మళ్లీ ఇప్పుడు పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి చెందిన కొందరు ఇదే స్థలంలో నాలుగురోజుల క్రితం గుడిసెలు వేశారు. తమకు ఇళ్లస్థలాలు లేవని దీంతో ఈస్థలంలో ఇల్లు నిర్మించుకుంటామని వారు చెబుతున్నారు. కాగా ఈ గుడిసెల్లో రెండ్రోజుల క్రితం ఒకదానిని స్థానిక రెవెన్యూ అధికారులు తొలగించి ఊరుకున్నారు. అలాగే ఈకాల్వభూమిని ఆనుకుని పొలాలున్న కొందరు రైతులు కూడా ఈ భూమి ఆక్రమించి తమ పొలాల్లో కలిపేసుకున్నారు. దీంతో ప్రైవేట్ భూమిలో ప్రభుత్వ కాల్వపోరంబోకు భూమి ఎక్కువ కలసిపోయి కాలువ కనుమరుగైంది. కాగా సర్వేనెంబరు 301/2లోని ఆక్రమణలను తూతూమంత్రంగా తొలగించిన స్థానిక రెవెన్యూ సిబ్బంది..చుట్టూ ఉన్న వ్యవసాయ భూమిలో కలసిపోయితున్న విలువైన భూమిని కాపాడడంలో మాత్రం చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి కాల్వపోరంబోకు భూమి మొత్తాన్ని సమగ్రంగా సర్వేచేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

శరణాగతి భక్తి నేర్పిన అన్నమయ్య



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 5: భగవంతుడి తత్త్వం తెలుసుకోవడానికి శరణాగతి తప్ప మరో మార్గం లేదని తెలియజేసిన వాడు అన్నమయ్య అని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ రవికుమార్ అన్నారు. వేంకటేశ్వరస్వామి పరమ భక్తుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నమాచార్య కళామందిరంలో సాహిత్య సభ నిర్వహించారు. అన్నమయ్య - యోగ సంకీర్తనలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ వైష్ణవాచార్యులు భగవద్ రామానుజులు తెలిపిన అష్టాక్షరీ మంత్రాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా వ్యాప్తి చేశారన్నారు. అన్నమయ్య తన యోగసంకీర్తనల ద్వారా ధర్మ, భక్తి, శరణాగతి, అహించన బోధించారన్నారు. నరసాపురానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ రామారావు అన్నమయ్య - భావుకత అనే అంశంపై ప్రసంగించారు. తిరుపతికి చెందిన తెలుగు అధ్యాపకులు శ్రీరాములు వాగ్గేయకారులు - అన్నమయ్య అనే అంశంపై ప్రసంగించారు. అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు సంకీర్తన విభావరి నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ, నగరవాసులు పాల్గొన్నారు.

కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు





తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 5: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం 7.45 నుంచి 8.25 గంటల మధ్య కంకణబట్టార్ సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహించారు. అంతకు ముందు 6.30నుంచి 7.45 వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు, ధ్వజపటం, చక్రతాళ్వారుల తిరువీధి ఉత్సవం నిర్వహించారు. 10 నుంచి 11.30 వరకు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 8.30 వరకు పెద్ద శేష వాహనసేవ చేశారు. తిరుమల పెద్ద జీయంగారు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శనివారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహన సేవ ఉంటాయి.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఎస్వీ, పద్మావతి జూనియర్ కాలేజీలు, పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ భవనాలను కలెక్టర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.



స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

సాంకేతిక రంగంలో పురోగతి అవసరం

ఏడీఏ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న సతీష్‌రెడ్డి

ఏర్పేడు, ఏప్రిల్ 5: గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ వంటి కీలకమైన సాంకేతిక రంగాల్లో పురోగతి అవసరమని భారత ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. తిరుపతి ఐఐటీలో తొమ్మిదో ఇన్‌స్టిట్యూట్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.సతీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దేశంలో జరుగుతున్న ఏరోస్పేస్ పరిశోధన, అభివృద్ధి తదితర అంశాలపై ప్రసంగించారు. సెన్సార్లు, డిటెక్టర్లు, లేజర్ డయోడల్ అభివృద్ధి చాలా అవసరమన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పరిశోధన ప్రచురణలు, ప్రాజెక్టు స్పాన్సర్‌షిప్‌లు, విద్యార్థుల అకడమిక్ ట్రైడ్‌లో ఇన్‌స్టిట్యూట్ పురోగతిని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చెత్త విషయమై ఘర్షణ

● నెమళ్లగుంటపల్లెలో ఐదుగురికి గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం

రామచంద్రాపురం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని నెమళ్లగుంట పల్లెలో ఇరువర్గాల మధ్య కొన్నాళ్లుగా దారి విషయమై వివాదం ఉంది. శుక్రవారం ఉదయం ఇద్దరు మహిళలకు ఇంటి ముందు చెత్త ఊడ్చటంలో మాటామాట పెరిగింది. దీంతో పరస్పరం దాడి చేసుకోవడంతో ఐదుగురు గాయాలపాలవగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.నెమళ్లగుంట పల్లెకు చెందిన కె.దొరసానమ్మ శుక్రవారం ఉదయం తన ఇంటి ముందు చెత్త ఊడ్చుతుండగా సుందరమ్మ ఇంటి ముందు పడింది. దీంతో ఇద్దరూ అరుచుకున్నారు.దొరసానమ్మ భర్త కొండారెడ్డి, సుందరమ్మ తరపున ఆమె బంధువు భాస్కర రెడ్డి జోక్యం చేసుకోవడంతో వివాదం పెద్దదైంది. పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు తలపడడంతో ఈశ్వరమ్మ,కొండారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా వుంది. కొండారెడ్డి బంధువులు చిన్నక్క, నవీన్, రూపేష్‌మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల వారూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గాయపడిన ఈశ్వరమ్మ, చిన్నక్క, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్, కొండారెడ్డి

మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం



మద్యం మత్తులో బుజ్జిబాబు

ఏర్పేడు, ఏప్రిల్ 5: ఏర్పేడులోని అశోక్‌నగర్‌లో శుక్రవారం రాత్రి 9గంటలకు పండరి భజన నేర్చుకుంటున్న మహిళల వద్ద ఓ కానిస్టేబుల్ మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఏర్పేడు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బుజ్జిబాబు మద్యం మత్తులో అశోక్‌నగర్‌లోకి ప్రవేశించి భజన నేర్చుకుంటున్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు.చొక్కా విప్పి వారిమధ్యలో కూర్చుని వీరంగం చేశాడు.అక్కడి నుంచి వెళ్లిపోవాలని మహిళలు ప్రాధేయపడినా ఆయనమాత్రం వెళ్లలేదు. అంతటితో ఆగకుండా భజన సామగ్రిని పగలగొట్టి గందరగోళం సృష్టించాడు. దీంతో అశోక్‌నగర్‌వాసులు కొంతమంది బుజ్జిబాబును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.తిరుపతి ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి రవి తెలిపారు.

2 నుంచి ఏపీఆర్‌సెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీ కోసం చేపట్టిన ఏపీఆర్‌సెట్‌ను మే 2 నుంచి 5వరకు నిర్వహించనున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తామని అయన చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, రాష్ట్రంలోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

అమరావతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్-2024 దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ విద్యార్థులు, తల్లిదండ్రుల వినతులతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 27న యథావిధిగా జరుగుతుందని, అందులో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టంచేశారు. ప్రవేశ పరీక్షకు సన్నద్ధమయ్యే వారికోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ నెల 8 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

9న స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 5 : ఉగాది పండుగ సందర్భంగా స్విమ్స్‌లో ఈ నెల 9న ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అత్యవసర వైద్య సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని, ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాల ఆయన కోరారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

● భానుప్రకాష్‌రెడ్డికి వైసీపీ సలహా

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 5: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై విమర్శలు చేసే ముందు బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని టౌన్‌బ్యాంకు వైస్ చైర్మన్, వైసీపీ నేత వాసుదేవయాదవ్ హితవు పలికారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీలో అవినీతి జరుగుతోందని, చైర్మన్ కమీషన్లు తీసుకుంటున్నారని అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భానుప్రకాష్ రెడ్డి ఏనాడైనా కేంద్రానికి ఒక వినతిపత్రం అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. టీటీడీని అడ్డుపెట్టుకుని ఎలా లాభపడుతున్నావో అందరికీ తెలుసన్నారు. ఇకపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నేత పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.

రుయాలో కానరాని సమయపాలన

● వైద్యులు, సిబ్బంది ఆలస్యంతో రోగులకు తప్పని ఇబ్బందులు




పది గంటలకు ఆరోగ్యశ్రీ క్యాబిన్‌లో కానరాని సిబ్బంది - ఆరోగ్యశ్రీలో ఇచ్చే ఛార్జీల నగదు కోసం వేచివున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 5 : రుయాస్పత్రిలో ఉదయం 8.30 గంటలకే ఓపీ సేవలు ప్రారంభమవుతాయి. ఓపీ చూపించుకున్న వారు వెనువెంటనే రక్తపరీక్షలు, వైద్యం కోసం ఆరోగ్యశ్రీలో పేర్లు నమోదు చేసుకోవాలి. అయితే శుక్రవారం పది గంటలకు కూడా ఆరోగ్యశ్రీ నమోదు కేంద్రంలో, రక్తపరీక్ష కేంద్రంలో సిబ్బంది రాకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. వైద్యులు మధ్యాహ్నం 12.30 గంటల వరకే అందుబాటులో ఉంటారు. ఈ లోపు ఓపీలో వారు చెప్పిన వైద్య పరీక్షలు చేయించుకుని వస్తేనే వైద్యం చేస్తారు. లేదంటే వారి కోసం మరో వారం ఆగాల్సి వస్తుంది. వైద్యం పొందాలంటే తప్పని సరిగా ఆరోగ్యశ్రీలో వివరాలు నమోదు చేసుకోవాలి. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో అవస్థలు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వారికి డిశ్చార్జి సమయంలో ఛార్జీలకు నగదు చెల్లిస్తారు. చెల్లించే వ్యక్తి నిత్యం సెలవులో ఉండటం లేదా అందుబాటులో లేకపోవడంతో ఈ పనిని రోజుకో ఉద్యోగికి అప్పగిస్తుండటంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోందన్న విమర్శలున్నాయి.

తెలుగు భాషోద్యమ సమితి కథల పోటీ

విజేతలకు రేపు సత్కారం

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 5: తిరుపతికి చెందిన తెలుగు భాషోద్యమ సమితి ఇటీవల ఉగాది కథల పోటీలు నిర్వహించింది. విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేయనుంది. ఉదయం 10 గంటలకు యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ సభకు సమితి అధ్యక్షులు గంగవరపు శ్రీదేవి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత, ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి ముఖ్య అతిథిగా, సాహితీ విమర్శకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రధాన వక్తగా హాజరవుతారని కథల పోటీల నిర్వాహకుడు ఆకుల మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి

ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఎన్నికల ప్రచారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఎస్వీ యూనివర్సిటీ ఎదురుగా గల తారకరామా స్టేడియంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఉదయం మైదానంలో మార్నింగ్ వాక్‌లో ఉన్న పలువురిని కలిసి ఆయన ఓటు అభ్యర్థించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

శ్రీరామలో ముగిసిన తరంగ్2కే24



బహుమతులు ప్రదానం చేస్తున్న మన్నెం రామిరెడ్డి తదితరులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 5: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో తరంగ్- 2కే24పేరిట రెండ్రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులు పలు శాస్త్రీయ, జానపద, సినీ గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాల సాధనకు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. చదువుతోపాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పెంచుకోవాలని, ఇందుకోసం కళాశాలలో ఉన్న వనరులను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతిభచాటిన విద్యార్థులు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్లు మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 126మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5 : జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షలకు జిల్లాలో రెండవ రోజు శుక్రవారం 126మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ టి.కైలాష్‌నాథ్ పేర్కొన్నారు. జూపార్క్ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో జరిగే పరీక్షకు 1,415 మంది విద్యార్థులకుగాను 1,289 మంది హాజరయ్యారని తెలిపారు. అంతకుముందు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, కేంద్రంలోకి అనుమతించారు.

కొత్త అల్ట్రాడీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సుల రాక



తిరుపతి డిపో గ్యారేజీలో నూతన అల్ట్రా డీలక్స్ బస్సు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 5: తిరుపతి డిపోకు ఒక అల్ట్రాడీలక్స్ శ్రీకాళహస్తి డిపోకు రెండు సూపర్‌లగ్జరీ బస్సులు శుక్రవారం ఉదయం చేరుకున్నాయి. అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన ఈ బస్సులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ పొందించారు. రిజిస్ట్రేషన్, రహదారి అనుమతులు పూర్తి చేసుకున్న తర్వాత రోడ్డెక్కనున్నాయి.

27, 28 తేదీల్లో టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్కు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 5: క్రికెట్ ప్రేమికులకు వినోదం కలిగిస్తున్న టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్కును ఈ నెల 27, 28 తేదీల్లో తుమ్మలగుంట మైదానంలో ఏర్పాటు చేయనున్నారు. దాదాపు 10వేల మంది వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్, డిజిటల్ సౌండ్‌సిస్టమ్, లైటింగ్‌షోలు, నోరూరించే అల్పాహారాలు, పానీయాల విక్రయ కేంద్రాలు, వీఐపీ గ్యాలరీలు, పిల్లలను అలరించే ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. మధ్యాహ్నం 3నుంచి రాత్రి 11.30గంటల మధ్య రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. 27న డీసీ-ఎంఐ, ఎల్ఎస్‌జీ-ఆర్ఆర్, 28న జీటీ-ఆర్సీబీ, సీఎస్‌కె-ఎస్ఆర్‌హెచ్ తలపడనున్నాయి.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



బస్టాండులో తనిఖీలు చేస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 5: ఎన్నికల ప్రవర్తన నియామళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి డిపో మేనేజర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సెంట్రల్ బస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిద్ధం సభలకు వెళ్లి వస్తున్న బస్సుల్లో ప్రచార బ్యానర్లు, స్టిక్కర్లు, ఆహార పొట్లాలు, బాటిల్స్ వంటివి ఉంటే సంబంధిత డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని సూచించారు. బస్టాండు దుకాణాల్లో ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. ఓ దుకాణంలో సిగరెట్లు విక్రయిస్తుండగా గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన రుయా ఉద్యోగి సరెండరు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 5 : ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన రుయా ఉద్యోగిని తక్షణమే సరెండర్ చేయాలని డీఎంఈ నరసింహాలు రుయా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియామవళి అమల్లో ఉన్న క్రమంలో రుయాలో నాన్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్‌గా కాంట్రాక్టు కింద డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉమామహేశ్వరావు గతనెల 20న తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును కలిసి రాజకీయ చర్చల్లో పాల్గొనడమేగాక ఆయనతో కలిసి ఫొటోలు దిగాడు. ఈ విషయంపై అదే నెల 23న ఆంధ్రజ్యోతిలో కోడ్ ఉల్లంఘించిన రుయా ఉద్యోగి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అప్పటి కలెక్టర్ వెంటనే ఉమామహేశ్వరావుపై చర్యలు తీసుకోవాలని రుయా అధికారులను ఆదేశించారు. అప్పటి నుంచి దీనిపై విచారణ సాగుతోంది. తాజాగా ఆయన్ను రుయా నుంచి రిలీవ్ చేసి, కడపకు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఆ బాధ్యతలను మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఈ.రామాంజనేయులుకు అప్పగించారు.

కాంగ్రెస్ అవకాశమిస్తే పోటీ చేస్తా

నవీన్‌కుమార్‌రెడ్డి



షర్మిలకు నవీన్ సత్కారం

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకుడు, రాయలసీమ పోరా ట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుపతి ప్రశాంత వాతావరణంలో ఉండేదని, ఈ ఐదేళ్లలో దౌర్జన్యాలు, అక్రమాలు పెరిగాయని అన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలతో నగర రాజకీయాలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావాలంటే నిజాయితీ కలిగిన వ్యక్తులకు టిక్కెట్లు ఇచ్చి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలని హైకమాండ్‌కు విజ్ఞప్తి చేశారు. సీనియర్ నాయకుల్లో ఎవరికి అవకాశమిచ్చినా విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

కూటమి అభ్యర్థులకు బలిజ మహాసభ మద్దతు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 5: కూటమి అభ్యర్థులకు మద్దతు తెలియజేస్తున్నట్లు రాయలసీమ బలిజ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరాయల్ వెలిశెట్టి తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో ఒక్క బలిజ కులస్థునికి కూడా వైసీపీ సీటు కేటాయించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి తరఫున బలిజలకు నాలుగు స్థానాలు కేటాయించడం హర్షణీయమన్నారు. అందుకే వారికి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. అనంతరం తిరుపతి జిల్లా నూతన కమిటీని నియమించారు.

ఓటర్ల చైతన్యం కోసం షార్ట్ ఫిలిం పోటీలు

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: జిల్లాలో యువ ఓటర్లను చైతన్యం చేసేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వీడియో నిడివి 100 సెకండ్లు మించరాదన్నారు. ఓటు విలువ తెలపడం, నిజాయితీగా ఓటు వేయడం, ఓటు శాతం పెంచడం వంటి వివరాలతో వీడియోను రూపొందించాలని తెలిపారు. పాల్గొనే వారు జిల్లాకు చెందిన వారై ఉండాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం, కాపీరైట్స్ యాక్ట్ అనుగుణంగా రూపొందించాలన్నారు. ఈ నెల 20 ఆఖరు తేదీ అని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440573537ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ధ్యానచంద్ర, అధికారులు అదితిసింగ్, పెంచలకిషోర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలతో పులకించిన సప్తగిరులు





తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊంజల్ సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానంతో తిరుమల సప్తగిరులు పులకించాయి. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ అనుగ్రహ భాషణం చేశారు. అన్నమయ్యకు, అహోబిల మఠానికి ఎంతో అనుబంధముందన్నారు. అన్నమయ్య విద్యాభ్యాసం, వేదశాస్త్రాల అధ్యయనం ఇక్కడే సాగిందన్నారు. అహోబిలం నరసింహస్వామి అనుగ్రహంతో అన్నమాచార్యులు దీక్షపొంది మంత్రోపదేశం పొందారన్నారు. ఈ మంత్రోపదేశంలోని 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం శ్రీవారి అనుగ్రహమన్నారు. అన్నమయ్య సంకీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకువెళ్లడానికి యువ కళాకారులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయనకు గరుడ పురాణం 1, 2 పుస్తక ప్రసాదాన్ని ఈవో ధర్మారెడ్డి అందించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణశర్మ మాట్లాడుతూ అన్నమాచార్యుల వర్ధంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. పలు అన్నమయ్య కీర్తనలను కళాకారులు రసరమ్యంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జున, హెల్త్ అధికారి శ్రీదేవి, పేష్కార్ శ్రీహరి, ఏవీఎస్వోలు మనోహర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జనసేన జెండా ఎగురవేస్తాం

జీవకోనలో వైసీపీని ఖాళీ చేశాం - కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు





జీవకోనలో ప్రచారంలో పాల్గొన్న ఆరణి శ్రీనివాసులు - ఆరణిని సన్మానిస్తున్న ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు

తిరుపతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జనసేన పార్టీ జెండా ఎగురవేస్తామని, వైసీపీ నుంచి ప్రతిరోజూ పార్టీలో పెద్దయెత్తున చేరుతున్నారని కూటమి తరఫున పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జీవకోనకు చెందిన వైసీపీ 48వ డివిజన్ గౌరవాధ్యక్షుడు బాలాజీతోపాటు భరత్, కుమార్, పద్మనాభం, ఆదిమూలం రమేష్, కుట్టి, విష్ణు, రామకృష్ణ, సాయి, చందు, విజయ్, రాములు, మరో ఐదు వందల మంది కార్యకర్తలు ఆరణి సమక్షంలో జనసేనలో చేరారు. అనంతరం ఆయన రాఘవేంద్ర నగర్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. జీవకోనలోని మూడు డివిజన్లలో వైసీపీ ఖాళీ అయ్యిందని, కొన్ని రోజుల్లోనే నగరమంతా ఖాళీ కావడం ఖాయమని ఈ సందర్భంగా చెప్పారు. ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్‌తో ఆత్మీయ సమావేశంలో పాల్గొని, వారికి భరోసా ఇచ్చారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుమల తిరుపతి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పారిశుధ్య చర్యలు



వాష్ బేసిన్‌లో నీటిని తొలగించి శుభ్రం చేసిన సిబ్బంది - దుర్వాసన వస్తున్న అన్నం ప్లేట్లను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు - సహాయకులు భోజనం చేసే గదిని శుభ్రం చేస్తున్న కార్మికురాలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 5 : ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శుక్రవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్న తీరుపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది రోగుల సహాయకులు భోజనం చేసే గది ముందు, తాగునీటి కొళాయి వద్ద వాష్ బేసిన్‌ను శుభ్రపరిచారు. పక్కనే దుర్వాసన వెదజల్లుతున్న అన్నం ప్లేట్లను తొలగించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసి, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూపరింటెండెంట్ ఆదేశించారు.

శ్రీవారి సేవకులను చులకనగా మాట్లాడుతున్నారు

లక్కీడిప్‌లో వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కూడా పెట్టండి - డయల్ యువర్ ఈవోలో భక్తులు



తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నేను కొన్నేళ్లుగా శ్రీవారిసేవ కోసం వస్తున్నా. అక్కడున్న ఉద్యోగులు చాలా చులకనగా మాట్లాడుతున్నారు. స్వామికి, భక్తులకు సేవ చేసేందుకు వస్తున్నాం.. అలా మాట్లాడవద్దని చెప్పండి సార్ అంటూ హైదరాబాద్‌కు చెందిన రమాదేవి శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈవో స్పందిస్తూ ఇలా ప్రవర్తించడం దురదృష్టకరమని, కొంతమంది దురుసుగా మాట్లాడేవారు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. లడ్డూల కోసం అధిక సమయం క్యూలో నిరీక్షించాల్సి వస్తోందని నాగరాజు(హైదరాబాద్), అరుణ్(చెన్నై) ఈవోకు తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో 60 కౌంటర్ల ద్వారా లడ్డూలను అందజేస్తున్నామని, వేసవి నేపథ్యంలో అదనంగా మరో 10 నుంచి 15 కౌంటర్లను ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు. ప్రస్తుతం వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు రద్దు చేసిన క్రమంలో ఆ టికెట్లను లక్కీడిప్‌లో ఉంచాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఈవో బదులిచ్చారు. ఆఫ్‌లైన్ లక్కీడిప్ మెసేజ్‌లు రావడం లేదని రమేష్(జగిత్యాల), కిరణ్‌కుమార్(తిరుపతి) ఈవో దృష్టికి తీసుకువచ్చారు. యాప్ సక్రమంగానే పనిచేస్తోందని, మొబైల్ సిగ్నల్స్ సక్రమంగా లేని క్రమంలో కొందరికి మెజేస్‌లు రావడం లేదని ఈవో తెలిపారు. తిరుమలలో సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విష్ణునివాసంలో సేవకులకు సరైన వసతి లేదని రామలక్ష్మి అనే భక్తురాలు ఫిర్యాదు చేయగా, సమస్యలను పరిష్కరిస్తామని ఈవో బదులిచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 62,549 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,816 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

బాబుజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బ్యాంకు డైరెక్టర్ చీర్లకిరణ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, మణికంఠ, ధరణికుమార్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్థల భవిష్యత్తుకు ఉద్యోగుల పనితీరే కీలకం



మాట్లాడుతున్న రమణప్రసాద్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5: ఏ సంస్థ అభివృద్ధికైనా ఉద్యోగులు చూపే కృషి కీలకమని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ ఉద్ఘాటించారు. జూపార్కు రోడ్డులోని భారత, ఏపీ పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌ట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీలో ఉద్యోగులకు రెండు రోజులు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. రమణప్రసాద్ ఆధ్వర్యంలో కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధులు శ్రీధర్, ఎన్.ఎస్.రెడ్డి, జెనిస్ ప్రవర్తన, నాయకత్వం, బృందకృషి, భావవ్యక్తీకరణ, సమయపాలన, నైతిక విలువలు, క్రమశిక్షణ, జవాబుదారీతనం, డిజిటల్, వృత్తి నైపుణ్యాలు, ఆతిథ్యం, సానుకూల దృక్పథం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: రావే.. రావే.. క్రోధినామ సంవత్సర ఉగాదీ.. అంటూ సాగిన బహుభాషా కవి సమ్మేళనం ఆద్యంతమూ ఆకట్టుకుంది. ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగం - ఈ తరం కవితా వేదిక సంయుక్తంగా శుక్రవారం ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించాయి. ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన సాగిన ఈ కవి సమ్మేళనంలో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, అధ్యాపకులు, సాహిత్యాభిమానులు కవితా పఠనం చేశారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ధర్మనిధి సదస్సులు, వర్క్‌షాప్‌లు, పుస్తక పరిచయ సభలు, కవి సమ్మేళనాల ద్వారా తెలుగు భాషా, సాహిత్య ఉన్నతి కోసం తెలుగు విభాగం ఎంతో కృషి చేస్తోందన్నారు. సలహాదారు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగు విభాగంలో చదువుకున్న అనేక మంది కవులుగా రాణిస్తున్నారని చెప్పారు. ఈ తరం కవితా వేదిక గౌరవాధ్యక్షుడు ఆచార్య ఎస్టీడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన మహా ప్రస్థానం, తిలక్ రాసిన అమృతం కురిసిన రాత్రి ప్రతి సాహిత్య విద్యార్థీ తప్పనిసరిగా చదవాలని కోరారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులనూ, కవిత్వాన్ని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కవిత్వాన్ని బాగా చదవడం ద్వారానే కవిత్వాన్ని బాగా రాయగలరని అభిప్రాయపడ్డారు. ఉత్తమ కవితా పఠనం చేసిన పీజీ విద్యార్థులు తేజేశ్వర, సౌజన్య, నరేష్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ అశోక్, విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదరనాయుడు, కోసూరి దామోదర నాయుడు, కె.మునిరత్నం, కడియాల వెంకట రమణ, సీహెచ్ సౌభాగ్యమ్మ, డాక్టర్ వీఆర్ రాసాని, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ - టీడీపీ, జనసేన నేతలు - కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 5: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో..

తిరుపతి(విద్య): బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నివాళులర్పించింది. బైరాగిపట్టెడలోని జగ్జీవన్‌రామ్ పార్క్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆపస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజ, కార్యదర్శి సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు, సత్యవేడు అసెంబ్లీ ఇన్‌చార్జి దాము పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

తిరుపతి(నేరవిభాగం): తిరుపతి ఎస్పీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు. డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

డిస్కం కార్యాలయంలో..

తిరుపతి (ఆటోనగర్): తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ వీఎన్ బాబు, సీజీఎంలు జె.రమణాదేవి, కె.గురవయ్య, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, జీఎంలు పి.మురళి, ఆదిశేషయ్య, రామచంద్రయ్య, గోపాలకృష్ణ, చంద్రశేఖర్‌రావు, మధు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ఘన నివాళి

తిరుపతి: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కూటమి తరఫున పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, చినబాబు, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీహరి నాయుడు, కృష్ణ యాదవ్, మునిశేఖర్ రాయల్, సింగంశెట్టి సుబ్బరామయ్య, గంగులయ్య, వాలముని, రవి, యశోద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



ఘటనా స్థలంలో టీచర్ మృతదేహం

రవీంద్రనాథ రెడ్డి (ఫైల్‌ఫొటో)

పాకాల,ఏప్రిల్ 5: పూతల పట్టు-నాయుడు పేట జాతీయ రహదారిలోని పాకాల మండలం తోటపల్లె సమీ పంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పాకాల శివ శక్తి నగర్‌లో ఉంటున్న ఉపాధ్యా యుడు బి.రవీంద్రనాథరెడ్డి (55) పోలవరపుఇండ్లులోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసే వాడు. ఇటీవల పదో న్నతిపై శాంతిపురం మండలానికి వెళ్లాడు. శుక్రవారం సెలవు కావడంతో సొంతూరికి వచ్చాడు. వ్యక్తిగత పని నిమిత్తం తిరుపతికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా తోటపల్లె సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతిచెందాడు. ఈయన భార్య దామలచెరువు పంచాయతీ పత్తిపాటి వారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ప్రమాదవార్త విన్న భార్య, సహోపాధ్యాయులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త విషయమై ఘర్షణ

- నెమళ్లగుంటపల్లెలో ఐదుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడిన ఈశ్వరమ్మ, చిన్నక్క చికిత్స పొందుతున్న నవీన్

కొండారెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని నెమళ్లగుంట పల్లెలో ఇరువర్గాల మధ్య కొన్నాళ్లుగా దారి విషయమై వివాదం ఉంది. శుక్ర వారం ఉదయం ఇద్దరు మహిళలు ఇంటి ముందు చెత్త ఊడ్చటంలో మాటా మాట పెరిగింది. దీంతో ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో ఐదుగురు గాయాల పాలవగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి వివ రాలిలా.. గ్రామానికి చెందిన కె.దొరసానమ్మ శుక్రవారం ఉదయం తన ఇంటి ముందు చెత్త ఊడ్చుతుండగా సుందరమ్మ ఇంటి ముందు పడింది. దీంతో ఇద్దరు చెత్త తరలించే విషయమై వాదనకు దిగారు ఈ విషయమై దొరసా నమ్మ భర్త కొండారెడ్డి, సుందరమ్మ తరపున ఆమె బంధువు భాస్కర్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో వివాదం పెద్దదైంది. పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు తలపడటంతో ఈశ్వరమ్మ,కొండారెడ్డి తీవ్రంగా గాయపడటంతో పరి స్థితి విషమంగా మారింది. కొండారెడ్డి బంధువులు చిన్నక్క, నవీన్, రూపేష్, మరో ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తర లించారు. ఇరువర్గాల వారు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేశారు.

వెంబులూరులో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు ● రానుంది ఉమ్మడి ప్రభుత్వమే : కురుగొండ్ల



వైసీపీ వారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కురుగొండ్ల

డక్కిలి, ఏప్రిల్ 5 :వెంబలూరులో వైసీపీకి షాక్ తగిలింది. శుక్రవా రం వెంబులూరు పంచా యితీ నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్య కర్తలు పెద్ద ఎత్తున టీడీపీ లో చేరారు. టీడీపీలో చేరిన వారిలో పాయశం ప్రభాకర్, ఆలూరు దామోదర నాయుడు, పాయశం కోటే శ్వరరావు, పూల వెంకటేశ్వర్లు, గాలి సుబ్బయ్య, శంకరయ్య, లక్కాకుల కోటేశ్వ రావు, పాయశం కోటయ్య, దాసర ఇహరిబాబులు ఉన్నారు. వీరందరికీ మా జీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరా వులు పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్ని కలు అవినీతికి, అభివృద్ధికి మధ్యే పోటీ అని అన్నారు. అభివృద్ధి కోరుకొనే వా రంతా తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. వెంకటగిరి టీ డీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియను గెలిపిస్తే నియో జకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని చెప్పారు. టీడీపీ నాయకులు ఏ లేశ్వరం రామచంద్రయ్య నాయడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కర రెడ్డి, పీపీ చౌదరి, పోకూరు రమేష్, పాయశం గోపాల్, పోట్లా మునెయ్య, చింతమాను పెంచలయ్య, చింతమాను వెంకటపతి పాల్గొన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



బాలాయ పల్లి, ఏప్రిల్5: బాలా య పల్లి పంచా యతీకి చెందిన వైసీపీ నేతలు బొల్లినేని యుగంధర్ నాయు డు, గుండు బోయిన రమణయ్య యాదవ్ శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ వారికి పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుపై ఆధార పడి ఉందని భావించి పార్టీలో చేరామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మస్తాన్ నాయుడు, సత్యంనాయుడు, శ్రీహరి, రామచంద్ర నాయుడు, వెంకటక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

వెలికంటికి టీడీపీ అభ్యర్థి పరామర్శ

డక్కిలి, ఏప్రిల్ 5 : వైసీపీ సీనియర్ నాయకులు, జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ వెలికంటి రమణారెడ్డిని శుక్రవారం రాత్రి ఆయన నివాసంలో వెంకట గిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

సీఆర్ రాజన్‌కు సన్మానం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 5: చిత్తూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సీఆర్ రాజన్‌ను టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం యాదవ్, కార్యదర్శి సర్దార్ బాలకృష్ణ, అధికార ప్రతినిధి జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్ సేవ



నారాయణవనం, ఏప్రిల్ 5: నారాయణవనంలో వెలసిన కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మ వారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభి షేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాల తో అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజల్ సేవ కమనీయంగా జరిపించారు. ఈ సేవల్లో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

8 మంది వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 5 : కోట పట్టణంలోని 3 సచివాల యాలకు సంబంధించి 8 మంది గ్రామ వలంటీర్లు తమ పోస్టులకు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు.

50 మద్యం బాటిళ్ల పట్టివేత

కోట, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని గూడలి గ్రామా నికి చెందిన తోటకూరు మణి శుక్రవారం బెల్టు దుకా ణానికి తరలిస్తున్న 50 మద్యం బాటిళ్లను గూడలి వద్ద ఎస్‌ఐ నాగబాబు పట్టుకున్నారు. అతడి ద్విచక్ర వాహ నాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి



కోట, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని చంద్రశేఖరపురం వద్ద శుక్రవారం కుక్కల దాడిలో రెండేళ్ల ఆడ జింక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని కేశవరం, కొండుగుంట అడవుల నుంచి దాహార్తిని తీర్చు కునేందుకు రెండేళ్ల జింక చంద్రశేఖరపురం వైపు వచ్చింది. స్థానికంగా ఉన్న కుక్కలు ఆ జింకను వెంబడించడంతో ఊరి పొలిమేరల్లో ఉన్న ఇనుపకంచెలో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో కుక్కలు దాడిచేశాయి. దీంతో అది మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమా చారం ఇచ్చారు. వారు వచ్చి జింకను కేశవరం అడవుల్లో దహనం చేశారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోట, ఏప్రిల్ 5 : కోట మండలం గూడలిలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి వారి బ్రహ్మోత్స వాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 11 రోజులపాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసి ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంగమేశ్వరస్వామికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 5: స్థానిక త్యాగరాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్‌సంస్థ ఆధ్వ ర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహ కారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. విష్ణువందన, జమున, స్నేహలత, లక్ష్మీ, అనిత, పద్మా జానా సుధీర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సూపర్-6తో అభివృద్ధి, సంక్షేమం

గూడూరు, ఏప్రిల్ 5: ఉమ్మడి ప్రభుత్వం అధికా రంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్-6 పథకాలతో పేదల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యా రాణి అన్నారు. శుక్రవారం స్థానిక 20వ వార్డులో సూపర్-6 పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వీరుబోయిన వెంకటేశ్వర్లు, నటశేఖర్, నరేష్, మునీంద్ర, వల్లూరు మోహన్, రవీంద్రబాబు, నరసింహులు, తిరుపాల్, రత్నం, తీగల చంద్రశేఖర్, ఇంద్రవర్ధన్ పాల్గొన్నారు.

అక్కా..! పోయి వస్తానే...

- ముగిసిన ముత్యాలమ్మ జాతర



పోలేరమ్మ గ్రామోత్సవంలో జనసందోహం



పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం

చిల్లకూరు, ఏప్రిల్ 5: అక్కా..! పోయి వస్తానే... మళ్ళీ వచ్చే ఏడాది వస్తానే.. అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా భక్తులు చీరలు పరిచి సాష్టాంగ నమస్కారాలతో సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన పోలేరమ్మ వెళ్లనంపు కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగు రోజులు పాటు అత్యంత వైభవంగా జరిగిన జాతర ముగిసింది. గంగమిట్ట మీద కొలువుదీరిన పోలేర మ్మకు వేకువ జామున కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. అనంతరం పోలేరమ్మ వెళ్లనంపు కార్యక్రమంలో భాగంగా పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. వీధుల్లో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనం పారు. గ్రామోత్సవం నిర్వహిం చిన అనంతరం పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలక రించే ఘట్టం భక్తులను ఆకట్టు కుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలే రమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యే క పూజలు జరిపారు. తర్వాత ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మ ను తీసుకెళ్లి అక్కడ పంబలోళ్లు డప్పు వాయిస్తుండగా ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా భక్తులకు అమ్మవారు రావడంతో చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. గణాచారి ఆ మహిళా భక్తులపై పసుపునీళ్లు చల్లి దీవెనలు అందజేయడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్య వేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

స్తంభించిన వాహనాలు..

జాతర ముగియడంతో గమ్యస్థానాలకు చేరుకునే భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో తూర్పుకనుపూరులో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు బారులు తీరడంతో పలు చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. తూర్పుకనుపూరు శివారు, బల్లవోలు, చింతవరం, కోట మార్గంలో ఉత్తమ నెల్లూరు, సిద్ధవరం గ్రామాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

జాతరలో ఘర్షణ



గాయపడిన శివ

మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో జరిగిన ముత్యాలమ్మ జాత రలో శుక్రవారం రెండు గ్రామాలకు చెందిన వారి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం మేరకు... తూర్పు కనుపూరు గ్రామానికి చెందిన పలువురికి, కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన పలువురికి దర్శనం విషయమై స్వల్ప వివాదం చోటు చేసుకుంది. వివాదం కాస్త ఘర్షణకు దారి తీయడంతో కొత్తపట్నం గ్రామానికి చెందిన పలువురు తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన ఒబ్బాయి శివపై దాడి చేశారు. ఆయనకు రక్తగాయాలయ్యాయి. అలాగే శివకు చెందిన సత్రం తలుపులు సైతం పగలగొట్టారు. గాయపడిన శివను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం చెన్నైకు వెళ్లాడు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు ● తిరిగి చదును చేసిన కబ్జాదారుడు



భూస్వామిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

కోట, ఏప్రిల్ 5 : కోట మండలం తిన్నెలపూడి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును ఓ భూస్వామి శుక్రవారం కబ్జా చేసే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంకన్నపాళెం నుంచి తిన్నెలపూడి గ్రామంలోకి సుమారు 2.5 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డును వెంకన్నపాళెంకు చెందిన ఓ భూస్వామి జేసీబీ, డోజర్‌తో రోడ్డును పెకిలించి తన పొలంలో కలిపేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అంతేగాకుండా రోడ్డు పక్కనే విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలను తొలగించేందుకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక నాయ కురాలు గండవరం సుష్మారెడ్డి, సురేంద్రరెడ్డి, పెంచలయ్య, స్థానిక సర్పంచ్ హుటాహుటిన ఆక్రమిత స్థలికి చేరుకున్నారు. తక్షణం కబ్జా పనులు ఆపకపోతే దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. మూకుమ్మడిగా గ్రామస్తులంతా పనులను అడ్డుకున్నారు. దీంతో వివాదం నెలకొంది. ఎట్టకేలకు భూ స్వామి తాను తవ్వినరోడ్డుకు మట్టి తోలిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చాడు. ఇప్పుడే చేయాలని పట్టుబట్టడంతో వెంటనే మళ్లీ రోడ్డును యథావిధిగా చదునుచేశారు.

2 నుంచి ఏపీఆర్‌సెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: రాష్ట్రం లోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీ కోసం చేపట్టిన ఏపీఆర్‌సెట్‌ను మే 2 నుంచి 5వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవ చ్చని, రాష్ట్రంలోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తా మని తెలిపారు.

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

అమరావతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాలి సెట్-2024 దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిష నర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగిసి నప్పటికీ విద్యార్థులు, తల్లిదండ్రుల వినతులతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 27న యథావిధిగా జరుగుతుందని, అందులో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టంచే శారు. ప్రవేశ పరీక్షకు సన్నద్ధమయ్యే వారికోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ నెల 8 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

9న స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 5 : ఉగాది పండుగ సందర్భంగా స్విమ్స్‌లో ఈ నెల 9న ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర వైద్య సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని, ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాల ఆయన కోరారు.

శవ రాజకీయాలు జగన్‌కు అలవాటే: జనసేన

గూడూరు అర్బన్, ఏప్రిల్ 5: ఎన్నికలలో లబ్ధి పొందడానికి శవ రాజకీయాలు చేయడం సీఎం జగ న్‌కు అలవాటేనని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్ర శేఖర్ విమర్శించారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తండ్రి వైఎస్ మరణం, కోడికత్తి డ్రామా, వివేకానంద రెడ్డి హత్య ఘట నలను ఎన్నికలకు వాడుకోవడం జగన్‌కు అలవాటేన న్నారు. ఖజానాలో డబ్బులు లేక పింఛన్లు ఇవ్వలేకపోయారన్నారు. ఆ చేతగాని పాలనను కప్పి పుచ్చుకోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై దుష్ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఇంద్రవర్ధన్, విజయ్, అవినాష్, వసంత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రోబోటిక్స్, ఏఐతో సాంకేతిక విప్లవం



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న శ్రీనివాస్ నెహ్రూ

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 5: భవి ష్యత్తులో ఏఐ టూల్స్, రోబో టిక్స్‌తో సాంకేతిక విప్లవం రానుందని తిరుపతి రీజనల్ సైన్స్ కో-ఆర్డినేటర్ కోలా శ్రీనివాస్ నెహ్రూ తెలిపారు. గురు వారం పుత్తూరులోని హిమజ పాఠశాలలో 'థింకరింగ్ రోబోటిక్ ల్యాబ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నెహ్రూ, హి మజ విద్యాసంస్థల ఛైర్మన్ సురేంద్ర రాజు మాట్లాడుతూ రానున్న కాలంలో రోబోటిక్స్‌తో అన్ని పనులు జరగను న్నాయన్నారు. ప్రస్తు తం ఏఐ ద్వారా మరింత సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని తెలియజేశారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే రోబోటిక్స్‌పై శిక్షణ ఇవ్వడానికి రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభించినట్లు సురేంద్రరాజు తెలిపారు. అనంతరం హిమజ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



పుత్తూరులో జయహో బీసీ సమావేశం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సును పట్టణ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను సామాజికంగా, రాజకీయంగా ప్రోత్సహించింది ఎన్టీఆర్ అయితే ఆర్థిక సుస్థిరత సాధించే విధంగా సంక్షేమ పథకాలను వర్తింపజేసింది చంద్రబాబునాయుడేనని తెలియజేశారు. బీసీలకు పక్కాగృహాలు, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట వేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక బీసీలను అణచివేతకు గురిచేశారని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో బీసీలపై జరిగినన్ని దాడులు గతంలో ఎన్నడూ చోటు చేసుకోలేదన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తుచేశారు. పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో బీసీలు అభివృద్ధి సాధించాలంటే గాలి భానుప్రకాష్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీఆర్ యుగంధర్, ఐటీడీపీ కో-ఆర్డినేటర్ ఈశ్వరయాదవ్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



నారాయణవనం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని నాగిలేరుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు పెంచల జయరామయ్య, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం హరి ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆదిమూలం ఆయనకు కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెంచల జయరామయ్య మాట్లాడుతూ చంద్రబాబుతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, కేఎస్ రవి, హరి, మాణిక్యంరెడ్డి, గోవిందశెట్టి, బాబు, మణి, ఆనంద రావు, సుబ్రమణ్యం, దామోదర్‌రెడ్డి, వాసుదేవయ్య, పరుశు రామయ్య, వేలురెడ్డి, ముకేష్, షణ్ముగం, అలీ పాల్గొన్నారు.

దళిత బాంధవుడు బాబూ జగ్జీవన్ రామ్



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 5: దళితుల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి అజరామరమని ఎంఆర్‌పీఎస్ నాయ కుడు శివయ్య మాదిగ అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయం తిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి, ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్య దర్శి మునివేలు, నాయకులు మధు మాదిగ, గోవింద రాజులు, మస్తానయ్య, మనోజ్, ధనుష్, చరణ్, శ్యామ్, శివ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఎం కార్యదర్శి వెంకటేష్, సీఐటీయూ నాయ కులు ప్రవీణ్ కుమార్, రమేష్, రామలింగం, ధనంజయలు, రమేష్ పాల్గొన్నారు.



వడమాలపేటలో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

వడమాలపేట: వడమాలపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సంఘం నాయకులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివా ళులర్పించారు. నాయకులు జయంత్, గురవయ్య, ప్రభాకర్, దేవ య్య, నాగ రాజు, మునిబాబు, ఉమాపతి, బాల శంకర్, వెంకయ్య పాల్గొన్నారు.

మేం గెలిస్తే రూ.4వేల పింఛనిస్తాం

మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్: గాలి భానుప్రకాష్



కేవీపీఆర్‌పేటలో పర్యటిస్తున్న భానుప్రకాష్

నగరి ఏప్రిల్ 5: సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలి పిస్తే రూ.4000 పింఛను, మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి పట్టణ పరిధిలోని కేవీపీఆర్‌పేటలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భానుప్రకాష్ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో నగరిలో నేచిన వస్త్రాలకు దేశ, విదే శాల్లో గిరాకీ ఉండేదని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మరమగ్గ కార్మికులు రోజువారీ కూలీలుగా వెళ తున్నారని.. ఈపాపం జగన్‌రెడ్డి, రోజాలదేనని చెప్పారు. జగన్‌కి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, మాణిక్యవాసన్, రజని, నటరాజన్, రాజా, రామచంద్ర, మేఘనాథ, అయ్యప్పన్, వీకేఎస్‌వాసు, రుక్కుం బాలాజి, నూరుల్లా, మీరా, శ్రీనివాసులురెడ్డి, మధునాయుడు, టీఎ న్‌టీయూసీ బాలాజి, సురేష్‌నాయుడు, గుణశేఖర్, తది తరులు పాల్గొన్నారు.

గుండ్రాజకుప్పంలో టీడీపీ ప్రచారం

నగరి: సైకిల్‌గుర్తుకు ఓటేసి.. ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని మండల టీడీపీ నాయకులు కోరారు. గుండ్రాజకుప్పం పంచాయతీలో శుక్ర వారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురు షోత్తంనాయుడు, మహిళా రాష్ట్ర అధికారప్రతినిధి మీరా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, నాయకులు కృష్ణారెడ్డి, బాలసురేష్‌నాయుడు, ధనంజయ రాజు, లక్ష్మీపతిరాజు, మునీంద్ర, చిన్నబ్బరాజు, నారాయణ స్వామి నాయుడు, బాబునాయుడు, రవిరాజు, భాస్కర్‌రాజు, భాస్కర్‌మండడి, వరదరాజులు పాల్గొన్నారు.



ఘనంగా అమ్మవారి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమ్మవారికి శుక్రవారం విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

భూపరిహారంలో స్థానిక నేతల తీరుపై ఆగ్రహం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 5: భూ పరిహారం కోసం రోడ్డెక్కిన తమను, న్యాయంచేస్తామని స్థానికనేతలు హామీ ఇచ్చి విరమింపజేశారే తప్ప న్యాయం చేయలేకపోయారని పలువురు బాధితులు స్థానిక నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రాచెర్ల, చిన్నపాండూరు పంచాయతీల్లో శుక్రవారం సామర్ల హరి, దేవెళ్ల మహేంద్ర ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ ప్రచారం చేశారు. ఈసందర్భంగా రాచెర్లలో స్థానిక వైసీపీ నాయకులు అపోలో పరిశ్రమకు భూములిచ్చిన భూబాధితులతో కలిసి పరిహారంలో జరిగిన అన్యాయంపై వైసీపీ అభ్యర్థి దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం కోసం ఆందోళన చేస్తున్న తమను ఎంపీపీ భర్త దామోదరరెడ్డి ఇచ్చిన హామీతో ధర్నా విరమించినా తమకు న్యాయంచేయలేదని తెలిపారు. అనంతరం పలువురు స్థానికులు జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకున్న తమకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుక్కెడు నీటి కోసం పక్కనే ఉన్న మడుగు నుంచి తెచ్చుకుంటునామని వారు ఆయన ఎదుట వాపోయారు. అంతకు ముందు నూకతోని రాజేష్ ఓటర్లను ఆకట్టుకునేందుకు కర్రసాము చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దయాకరరెడ్డి, చిన్న, బొప్పల తిలక్, హరిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం



కానిస్టేబుల్ బుజ్జిబాబు

ఏర్పేడు, ఏప్రిల్ 5: మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌లో మహిళలు శుక్రవారం రాత్రి 9గంటలకు పండరి భజన నేర్చుకుంటున్న సమయంలో ఓ కానిస్టేబుల్ మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. వివరాలిలా.. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన బుజ్జిబాబు అనేకానిస్టేబుల్ మద్యం మత్తులో అశోక్‌నగర్‌లోకి ప్రవేశించి భజన నేర్చుకుంటున్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి బట్టలు ఇప్పి వారిమధ్యలో కూర్చుని వీరంగం చేశాడు. అయితే అక్కడి నుంచి వెళ్లిపోవాలని మహిళలు ప్రాధేయపడినా ఆయనమాత్రం వెళ్లలేదు. అంతటితో ఆగకుండా భజన సమగ్రిని అంతా పగలగొట్టి చాలా గందరగోళం సృష్టించాడు. దీంతో అశోక్‌నగర్‌వాసులు కొంతమంది కానిస్టేబుల్ బుజ్జిబాబును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి బ్లూకోల్ట్ నైట్‌డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ బుజ్జిబాబు మద్యం అతిగా సేవించి అశోక్‌నగర్‌కు వచ్చి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని అశోక్‌నగర్ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అశోక్‌నగర్‌వాసులు తిరుపతి ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి రవి తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు

రేణిగుంట, ఏప్రిల్ 5: రేణిగుంట పంచాయతీ కార్యాలయం అవినీతి తిమింగలాలకు నిలయంగా మారింది. ఏ పనికి వెళ్లినా లంచం ఇస్తేనే పనులు చకచక అవుతాయి. లేదా నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించే పరిస్థితులున్నాయి. ఆఖరికి పంచాయతీ వార్డు మెంబర్ సైతం చెయ్యి తడపందే పనులు కాని పరిస్థితి ఉందని సమాచారం. పంచాయతీ కార్యాలయానికి సామాన్య ప్రజలు పనుల నిమిత్తం వెళ్లాలంటే గజగజ వణికిపోతున్నారు. ఇంటి ప్లాన్ అప్రూవల్, కుళాయి కనెక్షన్, టైటిల్ చేంజ్‌కు ముక్కుపిండి లంచాలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన మొత్తంలో ప్రతి నెలకు షాడో ఎమ్మెల్యేకు వాటా వెళ్తుందని పంచాయతీ కార్యాలయంలో గుసగుసలాడుకుంటున్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ముగ్గురికి గాయాలు



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

తొట్టంబేడు, ఏప్రిల్ 5: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని లింగమనాయుడు పల్లె వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. నాయుడుపేట శ్రీకాళహస్తి జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు అంజూరుపాళెంకు చెందిన ఇద్దరు ద్విచక్రవాహనం పై వెళ్తున్నారు. అదే సమయంలో భవానీశంకరాపురానికి చెందిన గురవయ్య శ్రీకాళహస్తికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఓ ప్రైవేట్ వాహనంలో గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గురవయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంజూరుపాళెంకి చెందిన ఇద్దరికి స్వల్పగాయాలు కావడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందించలేదు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు



తొట్టంబేడు, ఏప్రిల్ 5: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిసున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిసి శ్రీకాళహస్తి మండలంలోని వెలంపాడు మాజీ సర్పంచ్, సీనియర్ వైసీపీ నాయకుడు పుల్లూరు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో వెలంపాడు, బత్తలపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సుమారు 50మంది టీడీ పీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి టీడీపీతోనే

దళితులు అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు చుక్కల రమేష్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెం, పుల్లారెడ్డికండ్రిగ, తొండమనాయుడు పైట దళితవాడలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు అంకయ్య, రాధాకృష్ణ, సుబ్రమణ్యం, రామచంద్రయ్య, సిద్దయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 5: శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం క్రాస్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న గిరిబాబును అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ తెలిపారు. అతని వద్ద 17మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేడు పిచ్చాటూరులో ఎన్నికల శంఖారావం సభ

సత్యవేడు, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని ఎంకేటీ కల్యాణ మండపంలో ఎన్నికల శంఖారావం మహాసభ శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి శుక్రవారం టీడీపీ కార్యాలయంలో తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్లు, పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా..?



సత్యవేడు, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నెల రోజులు అవుతున్నా మండలంలో కొన్ని చోట్ల అధికార పార్టీకి సంబంధించిన చిహ్నాలు, గుర్తులు అలాగే దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఏఎం పురం, మదనంబేడు గ్రామాల్లో ఇటీవల అధికార పార్టీ చేపట్టిన నేను సిద్ధం కార్యక్రమంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో పార్టీ రంగులతో దిమ్మెలను ఏర్పాటుచేసి జెండాను ఆవిష్కరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జెండా మాత్రం తీసి పార్టీ గుర్తులతో ఉన్న దిమ్మెలను అలాగే వదిలేశారు. దీంతో పార్టీ గుర్తులు కలిగి ఉన్న జెండా దిమ్మెలకు ఎలెక్షన్ కోడ్ వర్తించదా...అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ నేతలను సమన్వయ పరచడంలో పరిశీలకులదే వైఫల్యం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 5: సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో రాష్ట్ర అధిష్ఠానం పంపిన పరిశీకుల వైఫల్యమే కారణమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి ఏమిటీ అనే ఆలోచన గుర్తించి సత్వర చర్యలను తీసుకోకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. టీడీపీ అధిష్ఠానం అభ్యర్థిని ఎవరిని పంపినా గెలిపించాల్సిన వారు ఇలా చేయడం సరికాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ మృతదేహం

నగరి, ఏప్రిల్ 5: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి కంచికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఒకటి నగరి మండలంలోని వీకేఆర్‌పురం వద్ద ఉన్న బాలాజీ హోటల్ వద్ద శుక్రవారం ఉదయం ఆగింది. ప్రయాణికులంతా టిఫిన్ కోసమని బస్సు దిగారు. ఇదే బస్సు నుంచి దిగిన శ్రీకాళహస్తికి చెందిన అశోక్(26) మూత్రవిసర్జన చేయడానికి తిరుపతి- చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దాంతో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం వచ్చి బాధితుడిని నగరి ఏరియా వైద్యాశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించాక మృతదేహాన్ని కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. నగరి సీఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత మృతికి పలువురి సంతాపం

కేవీబీపురం, ఏప్రిల్ 5: మండలంలోని సిద్ధమనాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు లక్ష్మీపతి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, నాయకులు, కార్యకర్తలు గ్రామానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, చంద్రయ్యనాయుడు, రామచంద్రయ్య, మునికుమార్, నాగరాజురెడ్డి, బాలాజీ, డిల్లీనాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనంలో సంతోష్‌కుమార్‌కు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 5: మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్‌ను నెల్లూరు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సన్మానించి గౌరవ పురస్కారం అందజేశారు. నెల్లూరులో శుక్రవారం జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొని పండుగ విశిష్ఠతను వివరించారు. నెల్లూరు ప్రాచీన అధ్యాయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ ఉగాది పురస్కారం అందజేశారు.

జనసేనలో చేరిక

వరదయ్యపాళెం, ఏప్రిల్ 5:మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీకి చెందిన పలువురు జనసేనలో శుక్రవారం చేరారు. వీరికి జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అంబటి చిరంజీవియాదవ్, ఉపాధ్యక్షుడు దేవళ్ల తులసీరామ్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

మైనారిటీలపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు

అటకెక్కిన షాదీ మహల్ నిర్మాణాలు





సత్యవేడులో అసంపూర్తిగా ఉన్న షాదీమహల్ - వరదయ్యపాళెంలో షాదీమహల్‌కు కేటాయించిన స్థలం

సత్యవేడు, ఏప్రిల్ 5: మైనారిటీలపై జగన్ సర్కార్ చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో నిరుపేద ముస్లిం కుటుంబాలు వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు నిర్మించతలపెట్టిన షాదీ మహల్ నిర్మాణాలు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించేసింది. దీంతో పేద, మధ్యతరగతికి చెందిన ముస్లిం కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. సత్యవేడులో షాదీ మహల్ నిర్మాణం 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఆత్మ కార్యాలయం సమీపంలో కొంత స్థలాన్ని కేటాయిస్తూ రూ.ఐదు లక్షలు కేటాయించింది. రాజీవ్ పల్లెబాట కార్యక్రమానికి సత్యవేడు వచ్చిన అప్పటి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చేతుల మీదుగ షాదీ మహల్ నిర్మాణానికి భూమిపూజ కూడ చేశారు. అయితే నిధులు చాలక పోవడంతో కాంట్రాక్టర్ మొండి గోడల వరకే నిర్మించి పనులు ఆపేసి చేతులెత్తేశాడు. అనంతరం 2016లో అప్పటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య స్పందించి నిధులు మంజూరు కోసం సంబంధిత శాఖకు అంచనాలు పంపారు. అయితే సాంకేతిక కారణాలతో నిధులు విడుదలయ్యేందుకు జాప్యం నెకొంది. దీంతో ఆదిత్య తన సొంత నిధులు రూ.10 లక్షలు వెచ్చించి భవనంలో వధూవరుల గదులు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, ఎలక్రికల్ వైరింగ్, నీటి మోటార్ తదితర పనులు చేసి పెట్టారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీ మహల్ నిర్మాణాన్ని అసలు పట్టించుకునే లేదు.

వక్ఫ్‌బోర్డు నిధులు ఏమైనట్లు?

ఇదిలా ఉండగా 2020లో అసంపూర్తిగా ఉన్న షాదీ మహల్‌ను పూర్తి చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిమూలం వక్ఫ్‌బోర్డు నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో కాంపౌండ్ వాల్‌తో పాటు డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులు చేపట్టేందుకు అధికారులు స్థానిక కాంట్రాక్టర్ ఒకరికి అప్పగించారు. అయితే పనులు మాత్రం ఒక్క అంగుళం కూడా జరగలేదు. దీతో వక్ఫ్‌బోర్డు నిధులు ఏమైనట్లు అని స్థానిక ముస్లింలు ప్రశ్నిస్తున్నారు. 15 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న ఈ షాదీ మహల్ నిర్మాణం పూర్తయితే నిరుపేద ముస్లింలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వరదయ్యపాళెంలోనూ అంతే...!

వరదయ్యపాళెం మండల కేంద్రంలో రాజీవ్‌నగర్ మసీదు సమీపంలో షాదీ మహల్ నిర్మాణం కోసం 2004లో అప్పటి ప్రభుత్వం సుమారు 20 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. 2018లో మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య చొరవతో రూ.20 లక్షలు విడుదలయ్యాయి. పనులు టెండర్ దశలో ఉండగా ప్రభుత్వం మారిపోవడంతో షాదీ మహల్ నిర్మాణం అటకెక్కింది. గత ఏడాది ఆగస్టులో షాదీ మహల్ నిర్మాణానికి సీఎం జగన్ రూ.25 లక్షలు కేటాయించారని, పనులు త్వరలో మొదలవుతాయని స్థానిక నాయకులు అర్భాటంగా ప్రకటించారు. ఇంతవరకు అతీగతీ లేక పోవడంతో మాటఇచ్చి మడమ తిప్పారని జగన్ ప్రభుత్వంపై స్థానిక ముస్లింలు నిట్టూరుస్తున్నారు.

సాంకేతిక రంగంలో పురోగతి అవసరం

ఏడీఏ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



విద్యార్థినికి అవార్డు ప్రదానం చేస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

ఏర్పేడు, ఏప్రిల్ 5: గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ వంటి కీలకమైన సాంకేతిక రంగాల్లో పురోగతి అవసరమని భారత ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. తిరుపతి ఐఐటీలో తొమ్మిదో ఇనిస్టిట్యూట్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రక్షణ పరిశోధన, వైమానిక శాస్త్రంలో విశిష్ట వ్యక్తి అయిన డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలో జరుగుతున్న ఏరోస్పేస్ పరిశోధన, అభివృద్ధి తదితర అంశాలపై ఆయన ప్రసంగించారు. సెన్సార్లు, డిటెక్టర్లు, లేజర్ డయోడల్ అభివృద్ధి చాలా అవసరమన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ఇప్పటి వరకు ఐఐటీ సాధించిన ప్రగతిని వివరించారు. పరిశోధన ప్రచురణలు, ప్రాజెక్టు స్పాన్సర్‌షిప్‌లు, విద్యార్థుల అకడమిక్ స్రైడ్‌లో ఇన్‌స్టిట్యూట్ పురోగతిని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

తొట్టంబేడు, ఏప్రిల్ 5: శ్రీకాళహస్తి మండలంలోని ఓబులాయపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు పుల్లూరునాథమునిరెడ్డి మృతి చెందాడు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జలసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటిపర్తిరవీంద్రనాథ్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడికి పరామర్శ



అచ్చెన్నాయుడుతో మాట్లాడుతున్న ఉష

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాలు ఉషా పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి కళావతమ్మ కన్నుమూసిన విషయం తెలిసిందే. మాతృవియోగంతో బాధపడుతున్న అచ్చెన్నాయుడిని తెలుగు మహిళలు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని ఆయన స్వగృహంలో కలిసి సానుభూతి తెలిపారు. అంతకుముందు కళావతమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత, విశాఖ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో నీటికి కటకట



తహసీల్దారు కార్యాలయంవద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

రేణిగుంట, ఏప్రిల్ 5: స్థానిక బీసీ హాస్టల్లో తాగునీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల క్రితం హాస్టల్‌లోని బోరు రిపేరు కావడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి వాడుకుంటున్నారు. అయితే ఈ నీరు తాగేందుకు పనికిరాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం హాస్టల్ పక్కన ఉన్న తహసీల్దారు కార్యాలయంలో విద్యార్థులు సీసాల్లో నీటిని నింపుకున్నారు. ఇప్పటికైనా మోటారు త్వరగా రిపేరు చేసి తాగునీరు అందించలని విద్యార్థులు కోరుతున్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కి ఘన నివాళి



జగ్జీవన్ రామ్‌కి నివాళులు అర్పిస్తున్న స్కౌట్స్, గైడ్స్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని పలువురు నివాళులర్పించారు. శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ పురపాలక ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాళహస్తి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్ కె. ధనుష్, స్కౌట్ లీడర్లు విశ్వ, ముగ్ధశ్రీ, ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ 111 జయంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవయ్య మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బద్రి, నాగరాజు, సుధీర్, నాగేంద్ర, గురున్నాథం తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌కు వామపక్షాల మద్దతు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5: ఇండియా కూటమి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడుకు వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. రాజేష్ నాయుడు శుక్రవారం సీపీఎం, సీపీఐ ముఖ్య నాయకులను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి గెలుపుకు అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు సమాలోచించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ బత్తెయ్య నాయుడు, అన్నపూర్ణమ్మను కూడా రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసారు.

ముస్లింలను ఆదరించింది టీడీపీనే: సుధీర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు

రేణిగుంట, ఏప్రిల్ 5: ముస్లింలను ఆదరించి వారి అభివృద్ధికి కృషి చేసింది టీడీపీ అని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక షాదీమహల్లో ముస్లింసోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీ సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్ సతీమణి రిషితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మహబూబ్ బాషా, నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునస్వామినాయుడు, పుష్పనాథన్, కన్నన్‌రెడ్డి, జ్యోతి నారాయణ, రాజేష్ రెడ్డి, అమరనాథ రెడ్డి, విద్యాసాగర్, మైనార్టీ నాయకులు మునీర్, అఫ్రోజ్, ముస్లింమతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో సుధీర్‌రెడ్డి ప్రచారం

కృష్ణాపురం గ్రామంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలో ఉదయం ఎస్వీపురం, ఆర్.మల్లవరం, వెదలచెరువు, గుత్తివారిపల్లి గ్రామాల్లో ఇంటింటికిమీ బొజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పేడు: శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆదరించాలని ఆయన సతీమణి రిషితారెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.